క్లుప్తంగా

రాష్ట్ర బ్లైండ్ జూడో జట్టుకు టీషర్టుల పంపిణీ



టీషర్టులతో రాష్ట్ర బ్లైండ్ అండ్ పారా జూడో జట్టు, ప్రతినిధులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఈ నెల 26నుంచి 30వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రం, అమృతసర్‌లో 12వ జాతీయ బ్లైండ్ అండ్ పారా జూడో చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు రాష్ట్రం తరపున పాల్గొనే క్రీడాకారులకు జయరామ అసోసియేట్స్ ప్రొప్రైటర్ ఎం.మాధవరెడ్డి టీషర్టులను సమకూర్చారు. వీటిని గురువారం శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడాకారులకు రాష్ట్ర బ్లైండ్ జూడో అసోసియేషన్ అధ్యక్షుడు దివాకర్‌రెడ్డి, జెన్ అకాడమీ జూడో సంఘం అధ్యక్షుడు రాజేష్, రాష్ట్ర డెఫ్ జూడో సంఘం అధ్యక్షుడు భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర బ్లైండ్ అండ్ డెఫ్ జూడో సంఘం కార్యదర్శి కిరణ్‌కుమార్ అందజేశారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి పతకాలు సాధించాలని క్రీడాకారులను కోరారు.

నిత్యావసర సరుకుల వితరణ



నిత్యావసర సరుకులు, వస్త్రాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఆశ్రమ వెల్ఫేర్ ఆర్గనేజేషన్‌లోని వృద్ధులు, శారీరక, మానసిక దివ్యాంగులకు అవసరమైన నిత్యావసర సరుకులు, వస్త్రాలు, పండ్లు, బిస్కెట్లను గురువారం తిరుపతి లయన్స్ క్లబ్ వారు వితరణ చేశారు. తిరుపతి లయన్స్ క్లబ్ కార్యదర్శి ఎస్‌కే.ముబారక్ బాషా జన్మదినాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బి.మునికృష్ణ నాయుడు ఆధ్వర్యంలో వీటిని దివ్యాంగులు, వృద్ధులకు అందజేశారు. ఈ సందర్భంగా మునికృష్ణ నాయుడు మాట్లాడుతూ దివ్యాంగులకు తమ కార్యదర్శి ముబారక్ పుట్టిన రోజు సందర్భంగా రూ.15 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు, వస్త్రాలు ఆశ్రమ నిర్వాహకులకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో కళావతి, లయన్స్‌క్లబ్ కోశాధికారి వినోద్ వెంకటాచలం, సభ్యులు, ఆశ్రమ నిర్వాహకురాలు శోభారాణి పాల్గొన్నారు.

తెప్పపై ఆండాళ్ జల విహారం



తెప్పపై విహరిస్తున్న ఆండాళ్ అమ్మవారు

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ కార్తీక తెప్పోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం రాత్రి పద్మసరస్సులో తెప్పపై ఆండాళ్(గోదాదేవి) అమ్మవారు జల విహారం చేస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయంలో ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోదాదేవికి స్నపన తిరుమంజనం నిర్వహించి, ధూప, దీప నైవేద్యాలను సమ ర్పించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవర్లను పరిమళభరిత పుష్పమాలికలు, పట్టు పీతాంబరాలు, విశేష ఆభరణాలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చారు. మేళ తాళాలు, కోలాట ప్రదర్శనల నడుమ అమ్మవారిని ఊరేగింపుగా పద్మసరస్సు వద్దకు వేంచేపు చేశారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించిన తెప్పపై అధిష్టింపజేశారు.

గడువులోపు అభివృద్ధి పనులు పూర్తి

- స్మార్ట్ సిటీ సీఈఓ హరిత



స్మార్ట్ సిటీ అభివృద్ధి పనుల పురోగతిని వివరిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ హరిత

తిరుపతి తుడా: స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేస్తామని స్మార్ట్ సిటీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ హరిత అన్నారు. గురువారం తిరుపతి స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ 7వ వార్షిక సాధారణ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, స్మార్ట్ సిటీ చైర్మన్ వెంకటరమణ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశానికి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో స్మార్ట్‌సిటీ 32వ బోర్డ్ మీటింగులో ప్రతిపాదించి ఆమోదించిన వార్షిక బడ్జెట్‌పై, సంబంధిత అభివృద్ధి పురోగతి వివరాలపై సమీక్ష చేపట్టారు. ఇందుకు సంబంధించిన అభివృద్ధి వివరాలను వాటి పురోగతిని స్మార్ట్ సిటీ ఎండీ హరిత వివరించారు. స్మార్ట్ సిటీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని చైర్మన్, కలెక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. అన్ని పనులను నిత్య పర్యవేక్షణ చేసి ఇచ్చిన గడువులోపు పూర్తి చేస్తామని మేనేజింగ్ డైరెక్టర్ హరిత తెలిపారు. ఇంజినీర్ ఇన్ చీఫ్, డీటీసీపీ విద్యుల్లత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, డైరెక్టర్లు రమశ్రీ, రామచంద్ర రెడ్డి, జనరల్ మేనేజర్ చంద్రమౌళి, ఎంఈ చంద్రశేఖర్, ఏఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే బీజేపీ నేతల విమర్శలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

తిరుపతి కల్చరల్: భారతీయ జనతా పార్టీ నేతలు కేవలం తమ రాజకీయ ఉనికి చాటుకునేందుకు అర్థగోలుగా పస లేని విమర్శలు చేస్తూ కుట్రలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఏఆర్.అజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన స్వార్థ రాజకీయం కోసం అనేక పార్టీల మారిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పురంధేశ్వరి ఇటీవల రాష్ట్రంలో మద్యం, ఇసుక గురించి పచ్చి అబద్ధాలు వల్లించే ప్రయత్నం చేశారన్నారు. గత నాలుగేళ్లలో ఏపీలో మద్యం సేవించి 5 లక్షల మంది చనిపోయారని అసత్య ప్రచారాలు చేశారని, అది నిజమని ఆమె నిరూపించాలని, లేని పక్షంలో ప్రభుత్వానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిన్న మరో బీజేపీ నేత ఏ మాత్రం రాజకీయ అవగాహన లేకుండా రాష్ట్రంలో నిత్యావసర ధరలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విపరీతంగా పెంచిందని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. నిత్యావసర ధరలు కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉంటాయన్న కనీస పరిజ్ఞానం కూడా లేకుండా విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. రాష్ట్ర విభజన వల్ల ఏపీ నష్టపోయిందని, ఈ మేరకు కేంద్రం విభజన హామీలు ఇప్పటి వరకు అమలు చేయలేదన్న విషయం వీరికి గుర్తు లేదా ? అని ప్రశ్నించారు. ప్రజా సంక్షేమానికి నిరంతరం రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తుంటే చూసి ఓర్వలేక విమర్శలకు దిగడం దారుణమన్నారు. 1987 దేవదాయ శాఖ చట్టం ప్రకారం ఆలయాల అభివృద్ధికి, యాత్రికుల సంక్షేమానికి టీటీడీ నిధులు ఖర్చు చేయాలనే నిబంధన ఉందన్న విషయం మరిచి తిరుపతికి వచ్చే శ్రీవారి భక్తుల ఆరోగ్యం కోసం, పారిశుద్ధ్యం కోసం టీటీడీ నిధుల కేటాయింపు నిర్ణయాన్ని సైతం అడ్డుకోవడం శోచనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు పసుపులేటి సురేష్, జ్ఞాన ప్రకాష్‌రెడ్డి, కార్తీక జనార్దన్, వంశీ, మోహన్ పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే గుణపాఠం తప్పదు



సమావేశంలో మాట్లాడుతున్న డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ

- బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నేతల హితవు

తిరుపతి కల్చరల్: కమీషన్లకు కక్కుర్తి పడుతూ తన స్వార్థలాభాపేక్ష కోసం అడుగడుగునా అభివృద్ధిని అడ్డుకునే నీతిమాలిన రాద్ధాంతాలను బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి మానుకోవాలని, లేని పక్షంలో ప్రజాగుణపాఠం తప్పదని వైఎస్సార్‌సీపీ నేతలు హెచ్చరించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్ మాట్లాడుతూ అభివృద్ధికి మోకాలడ్డుతున్న బీజేపీ నేత తీరుపై మండిపడ్డారు. ఒక రాజకీయ నేతగా ఏనాడు ప్రజల సమస్యలపై, తిరుపతి నగర అభివృద్ధిపై మాట్లాడిన దాఖలాలు లేని భానుప్రకాష్‌రెడ్డికి నగర అభివృద్ధిని అడ్డుకునే అర్హత లేదన్నారు. గతంలో టీటీడీ బోర్డు సభ్యుడిగా దర్శనాలకు ప్రాధాన్యత ఇవ్వడం తప్ప ఏ ఒక అభివృద్ధి నిర్ణయం అయినా తీసుకున్నారా ? అని ప్రశ్నించారు. టీటీడీలో తీసుకునే ప్రతి నిర్ణయంపై, ప్రజా సంక్షేమం కోసం చేపట్టే ప్రతిపాదనలపై కోర్టులకు వెళ్లి ఫిర్యాదు చేసి తద్వారా ఉనికి చాటుకోవడమే భానుప్రకాష్‌రెడ్డి నైజమని ఎద్దేవా చేశారు. టీటీడీ నిధులు ఆలయాల అభివృద్ధి కోసం, యాత్రికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని చెప్పే మీరు శ్రీవారి దర్శనార్థం విచ్చేసే యాత్రికులకు మెరుగైన పారిశుద్ధ్యం అందించడానికి టీటీడీ నిధులు కేటాయింపు నిర్ణయాన్ని అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. టీటీడీలో తిరుపతి అంతర్భాగమని, ఇదే తిరుపతిలో తిరుపతి పరిపాలనా భవనం, కల్యాణ మండపాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, సత్రాలు, వసతి గృహాలు అనేకం ఉన్నాయన్నారు. కేవలం రాజకీయ ఉనికి కోసం భానుప్రకాష్‌రెడ్డి పసలేని విమర్శలు చేయడం తగదన్నారు. కార్పొరేషన్ ఆదాయం, ఖర్చు గురించి కనీస ఆలోచన లేకుండా అవాస్తవాలు ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో కార్పొరేటర్ పొన్నాన చంద్ర, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు దొడ్డారెడ్డి మురళీరెడ్డి,కుమార్, సురేంద్రరెడ్డి,శివ, సూర్య రాయల్, చిరంజీవి పాల్గొన్నారు.

రగ్బీ జాతీయ పోటీలకు ఎంపిక

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని హై స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న సుప్రిత రగ్బీ జాతీయ పోటీలకు ఎంపికైంది. ఇటీవల కర్నూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికై నట్లు పీడీ బందిల కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం పెద్ద పాండూరులో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో విద్యార్థిని సుప్రితను ఎమ్మెల్యే ఆదిమూలం అభినందించారు.



సుప్రిత

వేడుకగా దుర్గమ్మ ఆలయ కుంభాభిషేకం



ప్రత్యేక అలంకరణలో దర్శమిస్తున్న శ్రీకనక దుర్గమ్మ అమ్మవారు

చంద్రగిరి: మండల పరిధిలోని రెడ్డివారిపల్లి పంచాయతీ ఎగువరెడ్డివారిపల్లి గ్రామంలో వెలసిన శ్రీకనక దుర్గమ్మ ఆలయ మహాకుంభాభిషేక మహోత్సవాన్ని గ్రామస్తులు వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం ప్రాతఃకాలార్చన, దుర్గాసూక్తహోమం, జయాది నేత్రోన్మీలనం, ప్రాణ ప్రతిష్ఠ, కళాన్యాసం, పంచదర్పణం, మహాపూర్ణాహుతి, కలశోద్యాసనం నిర్వహించారు. అనంతరం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య మహాకుంభాభిషేక మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదుపరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వేద పండితుడు చెందూరు సీతారామశర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివాహ కానుక పంపిణీ



వధువు కుటుంబ సభ్యులకు పెళ్లికానుకను అందిస్తున్న నాయకులు

చంద్రగిరి: ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అందజేసిన ఎమ్మెల్యే వివాహ కానుకను పార్టీ నాయకులు అందజేశారు. గురువారం మండల పరిధిలోని శానంబట్ల పంచాయతీకి చెందిన చెందిన మానస, దినేష్‌కు చంద్రగిరి వివాహం నిశ్చయమైంది. ఈ సందర్భంగా చంద్రగిరి డివిజన్ పసల నాగరాజు, సర్పంచ్ యశోద శంకర్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో నాయకులు నూతన వధూవరులకు ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పంపించిన బంగారు తాళిబొట్టు, పట్టువస్త్రాలు, శ్రీవారి ప్రసాదం, అమ్మవారి పసుపు–కుంకుమ, వెండి మెట్టెలతో కూడిన కానుకను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మురగరెడ్డి, త్యాగరాజు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో గ్రామాల్లో ప్రశాంతత

- అడపారెడ్డిపల్లిలో రూ.కోటితో భజన మందిరం నిర్మాణం
- భూమిపూజ చేసిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని సత్కరిస్తున్న స్థానిక నేతలు

తిరుపతి రూరల్: ఆధ్యాత్మికత, దైవారాధనతో గ్రామాల్లో శాంతి, సౌభ్రాతృత్వం పెరిగి ప్రశాంతంగా ఉంటాయని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం పంచాయతీ పరిధిలోని అడపారెడ్డిపల్లిలో నూతనంగా రూ.కోటి నిధులతో నిర్మించనున్న శ్రీ సీతారామ భజన మందిరం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భక్తిభావాన్ని పెంపొందించడానికి శ్రీసీతారామ భజన మందిరాలు దోహదం చేస్తాయన్నారు. దశాబ్దాల క్రితమే ప్రతి గ్రామంలో శ్రీ సీతారామ ఆలయాలు నిర్మించారని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఐకమత్యంతో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు యువతను సన్మార్గంలో నడిపించేందుకు పలు గ్రామాల్లో ఆధ్యాత్మికత నిర్మాణాలకు సైతం నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. అడపారెడ్డిపల్లి గ్రామంలో స్థానికుల కోరిక మేరకు రూ.కోటి నిధులతో అధునాతన భజన మందిరాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు భజన మందిర నిర్మాణ నిర్వాహకులు గోవర్ధన్‌రెడ్డి, నాద మునిరెడ్డి ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆదెం మునిరెడ్డి, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వెహికల్స్ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న మేయర్ శిరీష దంపతులు

తిరుపతి కల్చరల్: లీలామహల్ సర్కిల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్రాన్‌క్లిన్ ఎలక్ట్రికల్ వెహికల్స్ షోరూంను గురువారం మేయర్ డాక్టర్ శిరీష, డాక్టర్ మునిశేఖర్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు దోహదపడే ఎలక్ట్రికల్ వాహనాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షోరూం అధినేతలు అప్పలనాయుడు, వెంకటరమణ మాట్లాడుతూ తమ షోరూంలో లభించే ఎలక్ట్రికల్ వాహనాలు 4 గంటలు రీచార్జింగ్ కలిగిన డ్యూయల్ బ్యాటరీ, రివర్స్ మోడ్, నేవిగేషన్ సౌకర్యంతో కొత్త ప్రాంతాలను తెలియజేసే సిస్టమ్ ఉందన్నారు. తమ వద్ద 120 నుంచి 200 కిలోమీటర్లు సామర్థ్యం ఉన్న వాహనాలు, రూ.95 వేల నుంచి రూ.1.50 లక్షల ధరకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం



ప్రమాదానికి గురైన వారిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

తిరుపతి మంగళం : అద్భుతంగా రోడ్లు వేసి ఆ రోడ్లలో అవసరమైన చోట స్పీడు బ్రేకర్లు వేశారు. అయితే ఆ స్పీడ్ బ్రేకర్లకు పెయింటింగ్ వేయకుండా వదిలేయడంతో తారు రోడ్డులో స్పీడు బ్రేకర్ ఉన్న విషయం తెలియక వాహనదారులు స్పీడుగా వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. వాహనదారుల పాలిట శాపంగా మారుతోంది. మంగళం–కరకంబాడి ప్రధాన మార్గంలోని ఆర్టీసి డిపో వద్ద బీటీ రోడ్డును అద్భుతంగా నిర్మించారు. అయితే ఆ రోడ్డు మార్గంలో ఉన్న స్పీడు బ్రేకర్లకు పెయింటింగ్ వేయడంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహించారు. దాంతో అటు మార్గంలో వెళ్లే వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. గురువారం ఆ మార్గంలో స్కూటర్‌పై వెళ్తున్న ఇద్దరు వృద్ధులు స్పీడు బ్రేకర్‌ను గమనించకపోవడంతో స్పీడుగా వచ్చి కింద పడ్డారు. వారికి గాయాలు కావడంతో అటు మార్గంలో వెళ్తున్న 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ఇంత అద్భుతంగా రోడ్లు వేసిన వారు చిన్నపాటి పెయింట్ వేయకపోవడంపై వాహనదారులు, స్థానిక ప్రజలు కాంట్రాక్టర్లపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా వెంటనే స్పీడు బ్రేకర్ల వద్ద పెయింటింగ్ వేయాలని కోరుతున్నారు.

సమష్టి కృషితో అభివృద్ధి సాధిద్దాం



ఐక్యత చాటుతున్న ముదిరాజ్ సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: ముదిరాజ్‌లంతా ఐక్యత చాటుతూ సమష్టిగా అభివృద్ధి పథంలో పయనించాలని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్ల నారాయణ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం యూత్ హాస్టల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో ముదిరాజ్ భవన నిర్మాణ సమస్యల పరిష్కారంపై చర్చించారు. అలాగే సంఘం బలోపేతం కోసం నూతన నియామకాలపై వచ్చే నూతన ఏడాదిలో ముదిరాజ్‌ల అభ్యున్నతికి తలపెట్టాల్సిన కార్యాచరణపై తగిన సూచనలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్ల నారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ముదిరాజ్‌లో చైతన్యం కలిగించి తద్వారా అందరూ సమైక్యతతో ముందుకు సాగేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే తిరుమల శ్రీవారి పాదాల చెంతన ఉన్న ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో ముదిరాజ్ కమ్యూనిటీ భవనాన్ని ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నేతలు జీవరత్నం, మాకం చంద్ర, శ్రీనివాస ముదిరాజ్, ఆదినారాయణ, మునికృష్ణ, భూపతి, దేశాయ్ ముదిరాజ్, ఉమాపతి ముదిరాజ్, కార్తీక్ కుమార్, శివాజీ ముదిరాజ్, కొండా ముదిరాజ్ పాల్గొన్నారు.

‘ఆడుదాం–ఆంధ్ర’ క్రీడాకారులను గుర్తిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యుగంధర్‌రెడ్డి

భాకరాపేట : దేశంలోనే అతి పెద్ద క్రీడా సంబరాలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం–ఆంధ్ర పేరుతో క్రీడా పండుగ నిర్వహిస్తుందని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, ఎర్రావారిపాళెం ఎంపీపీ శివలక్ష్మి అన్నారు. గురువారం చిన్నగొట్టిగల్లులో జగనన్న సమావేశ మందిరంలో, ఎర్రావారిపాళెం స్త్రీశక్తి భవనంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ, వార్డు వలంటీర్లుకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో ఐదు రకాల కాంపిటీటివ్ క్రీడాంశాలు, మూడు నాన్ కాంపిటీటివ్ క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. వీటిల్లో 15 ఏళ్లకు పైబడిన బాల బాలికలకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మిటన్ క్రీడలతో పాటు, సంప్రదాయ యోగా, టెన్నీకాయిట్, మారథాన్, పోటీలు నిర్వహిస్తారన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా వలంటీర్లు ఈ పోటీలకు క్రీడాకారులు వివరాలను నమోదు చేయడంతో పాటు ప్రజలను క్రీడా మహోత్సవానికి ఆహ్వానిస్తారన్నారు. వలంటీర్లు ఇంటికి వచ్చినప్పుడు లేదా క్రీడాకారులే నేరుగా తమ పరిధిలోని గ్రామ వార్డు సచివాలయాన్ని సంప్రదించి తమకు ఆసక్తి ఉన్న పోటీల్లో పాల్గొనే వివరాలను తెలియజేయవచ్చని కోరారు. డిసెంబరు 15 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో క్రీడలు ప్రారంభం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు దేవేంద్రబాబు, అమర్‌నాథ్, వ్యాయామ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

దుర్గిపేరికి వడ్డెర్ల పాదయాత్ర

ఏర్పేడు: ఎస్టీ జాబితాలో చేర్చాలని తిరుపతి నుంచి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి బయలుదేరిన వడ్డెర్ల మహా పాదయాత్ర గురువారం సాయంత్రానికి మండలంలోని దుర్గిపేరి గ్రామానికి చేరుకుంది. పలువురు వడ్డెరలు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. రాత్రి దుర్గిపేరిలో బసచేసి శుక్రవారం ఉదయం పాదయాత్రను ప్రారంభించనున్నారు. బీసీ, వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, సహదేవయ్య, విద్యాసాగర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దేదీప్యమానం.. నిత్య హోమం

అలిపిరి పాదాల మండపం వద్ద ఉన్న సప్త గోప్రదక్షిణ మందిరంలో నిత్య శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం గురువారం వేడుకగా ప్రారంభమైంది. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మంత్రి ఆర్‌కే రోజా, టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి, జేఈఓ సదా భార్గవి, వీరబ్రహ్మం అశేష భక్త జన వాహిని గోవింద నామస్మరణ మధ్య ఈ హోమాన్ని ప్రారంభించారు. సనాతన హైందవ సంస్కృతిలో హోమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. భక్తులు ఆ దేవదేవుని కృపాకటాక్షాలు పొందాలనే సంకల్పంతో టీటీడీ ఈ శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమానికి శ్రీకారం చుట్టింది.

– తిరుపతి కల్చరల్



కార్యక్రమంలో కోలాటాలు వేస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్ హరిత



దివ్యానుగ్రహ హోమంలో పాల్గొన్న భక్తులు



శ్రీశ్రీనివాస దివ్యానుగ్రహ హోమంలో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమంలో మంత్రి ఆర్‌కే రోజాకు సంకల్పం చేయిస్తున్న అర్చకులు



కళాకారుల ప్రదర్శన